www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 27 డిసెంబర్ 2025
5
కాకినాడ



పసికందు ప్రాణాలు కాపాడిన వైద్యులు

ప్రజాశక్తి-కాకినాడ

ఆడుకుంటూ మెంతో ప్లస్ డబ్బా మింగిన చిన్నారిని జిజిహెచ్ వైద్యులు సకాలంలో స్పందించి కాపాడారు. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం దేవుళ్లపల్లి గ్రామానికి చెందిన పండా జయదుర్గ, పండా దొరబాబు మూడు రోజుల క్రింతం ఫిట్స్ కోసం వైద్యం నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. వారికి 9 నెలల విజయదుర్గ అనే బాబు ఉన్నాడు. శుక్రవారం బాబు ఆడుకుంటూ మెంతో ప్లస్ డబ్బా మింగేశాడు. బంధువులు గమనించి వెంటనే బాబును అత్యవసర విభాగానికి తీసుకుని వెళ్లారు. సిఎంఒ డాక్టర్ సుష్మ తక్షణమే స్పందించి డాక్టర్ సత్యవాణి, డాక్టర్ మాణిక్యం, డాక్టర్ కాంతిమా సాయంతో బాలుని గొంతులో అడ్డుకున్న మెంతో ప్లస్ డబ్బాను తీసివేశారు. దీంతో బాలుని ప్రాణాలు నిలిచాయి.

అస్తవ్యస్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

- కందిపప్పు మాట మరిచిన కూటమి
- బియ్యం, పంచదారకే పరిమితం
- క్రిస్మస్, సంక్రాంతి కానుకల ఊసేత్తని వైనం
- సరుకుల కోసం లబ్ధిదారుల నిరీక్షణ



ప్రజాశక్తి ప్రతినిధి

ఒకప్పుడు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు కావలసిన నిత్యావసర సరుకులను పంపిణీ చేసేవారు. గత కొన్నేళ్లుగా ఈ వ్యవస్థను ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయి. కేవలం బియ్యం, పంచదారకే పరిమితం చేశాయి. గత ప్రభుత్వ హయాంలో పంపిణీ వ్యవస్థను నిర్లక్ష్యం చేయగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే ధోరణితో వ్యవహరిస్తోంది. కేవలం రెండు వస్తువులకే పరిమితం చేసింది. గతంలో క్రిస్మస్, సంక్రాంతి కానుకలు పేరుతో పండుగ సమయాల్లో కొన్ని రకాల సరుకులను పేదలకు అందించేవారు. చంద్రబాబు సారథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కనీసం వాటి పంపిణీ ఊసే ఎత్తడం లేదు. దీంతో ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు పేద, మధ్యతరగతి వర్గాల నుంచి వినిపిస్తున్నాయి.

కాకినాడ జిల్లాలో 6,45,811 బియ్యం కార్డులుండగా 1,060 రేషన్ షాపుల పరిధిలో సరుకులు పంపిణీ సాగుతోంది. ముఖ్యంగా రైస్ కార్డు పేద మధ్యతరగతి వర్గాలకు ఒక గుర్తింపు కార్డు లాంటిది. రేషన్ సరుకులు తీసుకోవాలన్నా, ఆదాయ ధ్రువీకరణ పత్రం పొందాలన్నా, ఇంకా ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోవాలన్నా రైస్ కార్డే కీలకంగా ఉంది. పూర్తిస్థాయిలో సరుకులను మాత్రం ఇవ్వడం లేదు.

కిలో రూ.20కే గోధుమ పిండి

వచ్చే నెల 1 నుంచి రేషన్ షాపుల్లో కిలో రూ.20కే గోధుమ పిండిని పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధ పడుతోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కేజీ గోధుమ పిండి రూ.40 నుంచి 80 దాకా ఉంది. ఏపీ ప్రభుత్వం మాత్రం ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా రేషన్ దుకాణాల్లో తక్కువ ధరకే గోధుమ పిండి అందించనుంది. మొదట జిల్లా కేంద్రాలు, పట్టణాలు, నగరాల్లో ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఆ తర్వాత పూర్తిగా గ్రామీణ ప్రాంతాల్లో దీన్ని అమలు చేయనుంది.

సరుకుల్లో కోత.. పేదలకు వాత

రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను ప్రభుత్వం పంపిణీ చెయ్యకపోవడంతో పేదలపై అదనపు భారం పడుతోంది. ఒక్కొక్కరికీ 5 కేజీల చొప్పున బియ్యం కిలో రూపాయికే పంపిణీ చేస్తోంది. కిలో పంచదార కూడా అందిస్తోంది. గత కొన్ని నెలలుగా కందిపప్పు పంపిణీని నిలిపివేసింది. ఈ ఏడాది మార్చి వరకూ అక్కడక్కడా అరకొర పంపిణీ జరిగినప్పటికీ ఏప్రిల్ నుంచి పూర్తిస్థాయిలో నిలిపివేశారు. కాకినాడ జిల్లాలో గత 9 నెలలుగా కందిపప్పు పంపిణీ దుకాణాల ద్వారా సరఫరా అవ్వడం లేదు. అక్కడక్కడ అరకొరగా పంపిణీ జరుగుతున్నప్పటికీ పంచదార నాణ్యత లేకపోవడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధర రూ.180 నుంచి రూ.200 ఉంది. జిల్లాకు సుమారు 650 టన్నుల కందిపప్పు అవసరం ఉంటుంది. రేషన్ షాపుల్లో కిలో కందిపప్పు రూ.67కు లభిస్తోంది. కానీ ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారులకు ఆర్థిక కష్టాలు తప్పడం లేదు. పౌష్టికాహారంలో భాగంగా ప్రతి ఇంట్లో పప్పులు తప్పనిసరిగా వినియోగించాలని వైద్యులు సూచిస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు పంపిణీ చేయకపోవడంతో పలువురు పేదలు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసుకుని వినియోగించుకోవాల్సి వస్తుంది. దీంతో అదనపు ఆర్థిక భారం భరించాల్సిన దుస్థితి ఏర్పడింది.

కానుకలు మరిచిన కూటమి

గతంలో క్రిస్మస్ సందర్భంగా సంక్రాంతి, రంజాన్ పండుగల నేపథ్యంలో ప్రత్యేకంగా రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా కొన్ని నిత్యావసర సరుకులను అందించేవారు. దీంతో పండుగ సమయంలో పేదలకు కాస్త ఊరట కలిగేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ఈ కానుకల పంపిణీ కార్యక్రమం పునరుద్ధరిస్తుందని పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇటీవల క్రిస్మస్ పండుగ ముగిసింది. కానీ కానుకను పంపిణీ చేయక పేద, మధ్యతరగతి వర్గాలు నిరాశ చెందాయి. వచ్చే సంక్రాంతికైనా సరుకులను ఉచితంగా అందిస్తుందని పేదలు ఎదురుచూస్తున్నారు.

ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

ప్రజాశక్తి-కాకినాడ

ఇవిఎం, వివి.ప్యాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయం వద్దనున్న ఇవిఎం గోదామును జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి రెవెన్యూ, ఎన్నికలు అగ్నిమాపక, పోలీస్ శాఖల అధికారులు, జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవిఎం, వివి.పాట్స్ భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఎన్నికల, అగ్ని మాపక శాఖల అధికారులను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా ఇవిఎం గోదామును పరిశీలించి నివేదిక పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలోని గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గోదామును పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట అర్బన్ తహసీల్దార్ వి.జితేంద్ర, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి ఎం.జగన్నాథం రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.సాయిబాబా (టిడిపి), ఎస్.అప్పారావు (బిఎస్పి), పోలిశెట్టి శ్రీను (కాంగ్రెస్), కె.కృష్ణమోహన్(ఆప్), ఆర్.వెంకటేశ్వరరావు (వైసిపి), సిహెచ్.రమేష్ బాబు (బిజెపి),పలివెల వీరబాబు(సిపిఎం), ఎ.సత్యనారాయణ (జనసేన) పాల్గొన్నారు.

ట్రాఫిక్, సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ ఎన్.రమేష్

ప్రజాశక్తి-కాకినాడ

ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పిఎస్ఆర్ లా కాలేజీలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగితే వెంటనే 108 లేదా 112కు సమాచారం ఇవ్వాలని, గాయపడిన వారిని గోల్డెన్ అవర్‌లోపు ఆసుపత్రికి చేర్చాలని సూచించారు. ప్రమాద బాధితులను రక్షించిన వారికి జిల్లా కలెక్టర్ ద్వారా రూ.25,000 విలువైన గుడ్ సమారిటన్ రివార్డు అందజేస్తారని వివరించారు. కాబోయే లాయర్లుగా సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, నష్టాలపై అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, రాష్ అండ్ నెగ్లిజెంట్ డ్రైవింగ్, మాడిఫైడ్ సైలెన్సర్ల వాడకం వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం నిషిద్ధమని స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాహనాలకు ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ ఎన్.రమేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ

ప్రజల సమస్యలకు పరిష్కారం అందించడమే ధ్యేయంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు ఆదేశాల మేరకు ప్రతి వారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎంపీ కార్యాలయ ఇన్‌ఛార్జి మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. జిన్నూరు బాబ్జి, సిరియాల కొండబాబు, కామాడి దశరథ్, చీకట్ల వెంకటేష్, బంగారు రాజు, గౌరీ శంకర్, డిఆర్‌యుసిసి సభ్యుడు ముత్యాల అనిల్, ఐటిడిపి పాలిక సతీష్ పాల్గొన్నారు.




అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి లక్ష్మణమూర్తి

క్రిస్మస్ వేడుకల్లో ఎంపీ ఉదయ్

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని లింగంపర్తిలో క్రిస్మస్ వేడుకలకు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు త్యాగనిరతికి, మానవ మనుగడకు నిదర్శనం అన్నారు. అనంతరం మాస్టర్ కుంపట్ల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. యుటిఎఫ్ మాజీ అధ్యక్షులు ఎబివి.ప్రసాద్, పిఎసిఎస్ అధ్యక్షుడు పెంటకోట మోహన్, జనసేన నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్, అచ్చే వీరబాబు, పలివెల వెంకటేష్, గంగిరెడ్ల మణికంఠ, బిషప్ అడప నాగమోహన్, దూది పాల్ శ్రీనివాస్, నక్క శాలెం రాజు ఉన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో ఎంపీ

కూటమి పాలనలో దోపిడీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రాష్ట్ర సంపదను కొందరికి దోచి పెట్టడానికే కూటమి ప్రభుత్వం పని చేస్తోందని వైసిపి రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అధికారం చేపట్టిన నాటి నుంచి ఆర్థిక లోటు కనిపిస్తోందన్నారు. గడచిన 8 నెలల్లో 163 శాతం ఆర్థిక లోటుకు చేరిందని కాగ్ నివేదిక ఇవ్వడం ప్రభుత్వ వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ఆదాయంలో ఎక్కువ శాతం కొంత మంది కాంట్రాక్టర్లకు దోచి పెట్టడమే కూటమి ప్రభుత్వ విధానంలా మారిందన్నారు. సంపద సృష్టిస్తానని సిఎం చంద్రబాబు చేసిన వాగ్దానాలు మరచి అడ్డూ అదుపూ కలేకుండా అప్పులు చేసుకుంటూ పోతున్నారని తెలిపారు. చేస్తున్న అప్పులు ఎక్కడి పోతున్నాయో కూడా చెప్పలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి చేరుకోవడం విచారకరమన్నారు.

బాబేజ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-ఏలేశ్వరం

కంప్యూటర్ పితామహుడు చార్లెస్ బాబేజ్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మార్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మార్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధినేత అడప దుర్గారావు మాట్లాడుతు బాబేజ్ కంప్యూటర్‌ను కనుగొని ప్రపంచానికి కొత్త సాంకేతికతను అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గోళ్ల సతీష్, కోరాడ రాజు, ఉడతల రమణారావు, గొల్లపల్లి గంగాధర్ జువ్వెన రాజు, ఆలమూరు సుబ్బారావు ఉన్నారు.

మద్యపాన వ్యతిరేక ప్రచార ర్యాలీ

ప్రజాశక్తి గొల్లప్రోలు, పిఠాపురం

మద్యం మత్తులో యువత జీవితాలు చిత్తు అవుతున్నాయని మద్యం బెల్టు షాపులు, సారా నిర్మూలించాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ అన్నారు. మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జెవివి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మద్యం మత్తులో యువత జీవితాలు చిత్తుకాకుండా చూడాలని కోరుతూ సైకిళ్లపై మద్యం నిర్మూలించాలని ప్రచార ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం పట్టణంలో రాయవరం రోడ్డు మార్కెట్ సెంటర్ మెయిన్ రోడ్డు మీదగా ఎంపిడిఒ ఆఫీస్ పలు ముఖ్య కూడళ్లలో ఈ సైకిల్ ప్రచారా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ జెవివి నాయకులు యు.సత్యనారాయణ రెడ్డి మద్యపాన వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు వేమగిరి తరుణ్ మాట్లాడుతూ గ్రామంలో బెల్ట్ షాపుల్లో మద్యం, సారా ఏరులై పారుతోందని తెలిపారు. యువకులు మత్తుకు బానిసై విద్యకు దూరమై చెడు మార్గం పడుతున్నారన్నారు. మహిళలు తమ భర్తలను కోల్పోయి నిరాశ్రయులు అవుతున్నారని తెలిపారు. ఈ సైకిల్ ర్యాలీ ద్వారా యువత నూతన సంవత్సరం మద్యానికి దూరంగా ఉండాలన్న ఉద్దేశమే ఈ సైకిల్ ర్యాలీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి గౌరవాధ్యక్షుడు దాడి పద్మనాభం, ప్రజా సంఘాల నాయకులు కె.సింహాచలం, కరణం విశ్వనాథం, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నాయకులు వి.తలుపులయ్య, వి.డేవిడ్, ఎల్.ఫిలిప్, వి.ఏసమ్మ, వి.యేసు బాబు, జెవివి నాయకులు అనిశెట్టి సీతారామరాజు, జెవివి మండల అధ్యక్షులు ఏలేటి నాని బాబు పాల్గొన్నారు.

పిఠాపురం మద్యం మత్తులో యువత జీవితాలు చిత్తు చేసుకోకూడదని, బెల్ట్ షాపులు, సారా నిర్మూలించాలని కోరుతూ మద్యపానం వ్యతిరేక ప్రచార కమిటీ, జన విజ్ఞాన వేదిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో స్థానిక ఉప్పాడ సెంటర్‌లో ర్యాలీని కార్యక్రమాన్ని జనవిజ్ఞాన వేదిక నాయకులు కొమనాపల్లి అప్పారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మద్యం వద్దు ఆరోగ్యం ముద్దు , బెల్టు షాపులు, మద్యం, సారా నిర్మూలించాలని నినాదాలు చేశారు. అనంతరం ఈ ప్రచార జాతా పిఠాపురం టౌన్ కోట గుమ్మం సెంటర్, మున్సిపల్ సెంటర్ మీదుగా నర్సింగపురం, జాములపల్లి, గోకివాడ, జగపతిరాజపురం, పి.తిమ్మాపురం, పి.రాయవరం, రాపర్తి, భోగాపురం, బి.పత్తిపాడు మీదగా గొల్లప్రోలు తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరింది. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కె.సింహాచలం, కరణం విశ్వనాథం, జిఎస్.భాస్కరాచార్యులు, వి.సూర్యనారాయణ, సిహెచ్.సతీష్, అల్లం పాపారావు, పిల్లి శ్రీను, కె.రాజు, నేమిశెట్టి గంగబాబు, వి.తలుపులయ్య, వి.డేవిడ్, ఎల్.ఫిలిప్, వి.ఏసమ్మ, వి.యేసు బాబు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని మల్లాం, ఎల్ఎన్.పురం, కోలంక, ఎఫ్కె.పాలెం, నవఖండ్రవాడ గ్రామాల్లో పలువురికి మాజీ ఎంఎల్ఎ, టిడిపి అధికార ప్రతినిధి వర్మ శుక్రవారం సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సుమారు రూ.8 లక్షల చెక్కులను వారి ఇంటికి వెళ్ళి అందజేశామన్నారు. ఆపదలో ఉన్న పేదలకు సిఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని , వారి ప్రాణ రక్షణకు ఈ నిధి ఒక సంజీవనిలా మారిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల సంక్షేమానికి అధ్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో నెరవేరుస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.గంగాధర్‌రావు, నాయకులు పిల్లా సురేష్, బుర్రా కుమార్, ఎరుబండి బాబులు, రామిరెడ్డి అప్పన్న, బాబూరావు, శ్రీను, సుబ్రహమణ్యం, సోమరాజు, సురేష్ పాల్గొన్నారు.

లౌకిక శక్తుల ఐక్యతతో రాజ్యాంగం, దేశ రక్షణ

ప్రజాశక్తి - సామర్లకోట



సభలో మాట్లాడుతున్న మధు

రాజ్యాంగాన్ని, దేశాన్ని కాపాడుకునే బాధ్యత లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు పేర్కొన్నారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా సామర్లకోటలో శుక్రవారం మెహర్ కాంప్లెక్స్ సెంటర్ నుంచి భారీ ప్రదర్శన నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు చెరుకూరి సుబ్బారావు మాస్టర్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించగా, పార్టీ కార్యాలయ పునర్నిర్మాణ ఫలకాన్ని తాటిపాక మధు ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు పట్టణ కార్యదర్శి పి. సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సభలో తాటిపాక మధు మాట్లాడుతూ, భారతదేశం నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, కేంద్రంలో మతతత్వ శక్తులు అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకొని అంబేద్కర్ సహా మహనీయులు అందించిన రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. రాజ్యాంగం ద్వారా ఏర్పడిన లౌకిక, ప్రజాస్వామ్య, ఫెడరల్ వ్యవస్థలపై ఫాసిస్టు శక్తులు దాడి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, పప్పు ఆదినారాయణ, శాఖ రామకృష్ణ, అన్నవరం, బొబ్బిలి శ్రీను, చింతపల్లి సుబ్బారావు, కట్ట సత్యనారాయణ, వై.బాబు, నాని స్టాలిన్, నంద కిషోర్, పాల్గొన్నారు.

పోలిశెట్టి షార్ట్ ఫిల్మ్‌కు అవార్డులు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇంటర్నేషనల్ ఫిలిం అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన ఎపి ఫిలిం ఫెస్టివల్లో ఉత్తమ కాన్సెప్ట్ విభాగంలో పెద్దాపురం పట్టణవాసి ఎన్‌బిఎస్ శ్రీనివాస్ పోలిశెట్టి దర్శకత్వంలో నిర్మించిన ఆకలి షార్ట్ ఫిలింకు అవార్డులు లభించాయి. ఉత్తమ కాన్సెప్ట్ విభాగంలో శ్రీనివాస్, ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్ విభాగంలో చైత్ర అవార్డులు పొందారు. ఈ ఫిలింలో గోపాల్ పోతుల ప్రధాన పాత్ర పోషించగా, ప్రమోద్ సంగీతం, గణేష్ మంతి ఫోటోగ్రఫీ, ఎన్‌బిఎస్.శ్రీనివాస్ పోలిశెట్టి నిర్మాణం, దర్శకత్వ భాధ్యతలు నిర్వహించారు.



అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్



సదస్సులో పాల్గొన్న సిబ్బంది, రైతులు

విత్తన శుద్ధి, సేంద్రియ సాగుపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

వేట్లపాలెంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వి.మురళీధర్ రైతులతో మాట్లాడారు. వరి సాగులో విత్తన శుద్ధి తప్పనిసరి అని తెలిపారు. వరి విత్తనాలను సూడోమోనాస్, ఫ్లోరోసెన్స్‌తో ట్రీట్మెంట్ చేయడం వల్ల మొలక శాతం పెరుగుతుందని, నేల ద్వారా వచ్చే ఎండాకు తెగులు, పొడ తెగులు వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. పొడి రూపంలో ఉన్న ప్సూడోమోనాస్ ఫ్లోరసెన్స్‌ను కిలో విత్తనానికి 10 గ్రాముల చొప్పున వినియోగించాలని రైతులకు సూచించారు. ఫార్మ్ యార్డ్ మెన్యూర్ అనగా పశువుల పెంట ప్రాముఖ్యతను వివరించారు. పశువుల పేడ, మూత్రం, ఎండిన ఆకులు, పలుచెత్త తదితరాలను కుప్పగా వేసి పూర్తిగా కుళ్లిన తర్వాత లభించే సేంద్రియ ఎరువునే ఎఫ్‌వైఎంగా పేర్కొన్నారు. ఇది నైట్రజన్, ఫాస్ఫరస్, పొటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాలు, సేంద్రీయ కార్బన్‌ను నేలకు అందిస్తుందని చెప్పారు. వరిలో ఎఫ్‌వైఎం వినియోగించడం వల్ల నేలలో సేంద్రీయ కార్బన్ పెరిగి నేల మదువుగా మారుతుందని, వేర్ల పెరుగుదల మెరుగై నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. దీంతో రసాయన ఎరువుల అవసరం కొంత మేర తగ్గి, పంటకు దీర్ఘకాలం పాటు నెమ్మదిగా పోషకాలు అందుతాయని వివరించారు. సాగు నీటి నాణ్యత పరీక్ష ఎలా చేయించుకోవాలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ రూప, విఎఎలు మణికంఠ, ప్రవీణ్, శ్రీనివాస్, పాలచర్ల వీర్రాజు, బొమ్మల వీరకుమార్, గున్నం శేషయ్య, సత్తిబాబు పాల్గొన్నారు.

టిడిపి నేత వరలక్ష్మికి ఘన సత్కారం

ప్రజాశక్తి-రౌతులపూడి

కాకినాడ పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షురాలుగా ఎంపికైన మండలంలోని ఎస్.పైడిపాల గ్రామానికి చెందిన గొల్లు వరలక్ష్మి శుక్రవారం టిడిపి శ్రేణులు ఘనంగా సత్కరించారు. టిడిపి యువ నాయకులు ఇటంశెట్టి అశోక్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు లాలం కృష్ణవేణి పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ

ప్రజాశక్తి-గండేపల్లి, పెద్దాపురం

ఆదిత్య యూనివర్సిటీ లియో క్లబ్ ఆధ్వర్యంలో సూరంపాలెంలో బాల్ వివాహ్ ముక్త్ భారత్ అవగాహనా ర్యాలీ నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపూ ప్రజలకు అవగాహన కల్పించడం, పిల్లల హక్కులు, విద్య, ఆరోగ్య పరిరక్షణ అవసరాన్ని తెలియజేయడం ఈ ర్యాలీ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని లియో కోఆర్డినేటర్ ఎన్.నరేష్ సమన్వయంతోతో స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ డి.కిషోర్, ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ కన్వీనర్ డాక్టర్ బి.వరప్రసాద్ సహకారం, మార్గదర్శకత్వం అందించారు.

పెద్దాపురం బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు అన్నారు. బాల్ వివాహ్ ముక్త్ భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీ వీర్రాజు హైస్కూల్లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, మండల న్యాయ సేవాధికార సంస్థ ల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పలువురు ప్రసంగించారు. హెచ్‌ఎం కొంపెల్ల లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో వారు మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, మానసిక అభివృద్ధి, సామాజిక భద్రతపై కలిగే ప్రతికూల ప్రభావాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. బాల్యవివాహాలు బాలికల భవిష్యత్తును దెబ్బ తీస్తాయన్నారు. బాల్యవివాహాలు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని వారు హెచ్చరించారు. సకురు దుర్గారావు, సిడిపిఒ జి.ఉష, పారా లీగల్ వాలంటీర్ నూతలపాటి అప్పలకొండ, బి.లక్ష్మి పాల్గొన్నారు.



గండేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదిత్య సిబ్బంది



శిబిరంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

వికలాంగులకు స్క్రీనింగ్ క్యాంప్

ప్రజాశక్తి-సామర్లకోట

ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వికలాంగుల సహాయ పరికరాల స్క్రీనింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి పిలుపునిచ్చారు. శుక్రవారం సామర్లకోట మండల కార్యాలయంలో ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ కాకినాడ ఆధ్వర్యంలో జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం సహకారంతో సహాయ పరికరాలకు స్క్రీనింగ్ కార్యక్రమం చేపట్టారు. ఎంపిడిఒ ఉమామహేశ్వరి మాట్లాడుతూ స్క్రీనింగ్ క్యాంప్‌లో 15 మందికి కొలతలు దరఖాస్తులు పూజ చేసి సొసైటీకి పంపించామని తెలిపారు. వీటిలో కాలిపర్స్ 3 లింబో ఒకటి మూడు చక్రాల వాహనాలు 3 చెవి యంత్రాలు 6 తదితర 15 మంది దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సొసైటీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్ఎ నాయుడు, సిబ్బంది, జిల్లా వికలాంగుల పునరావేశ కేంద్రం నుంచి ఆర్టిజన్ టెక్నీషియన్ సిబ్బంది, ఎం.వెంకట్రావు, కాలేజ్ ఆఫ్ ప్రత్యేక విద్యా సంస్థ నుంచి ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని సూర్యారావుపాలెం గ్రామానికి చెందిన సుంకర కృష్ణారావు(75) ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యారని తమకు ఫిర్యాదు అందినట్టు ఎస్ఐ డి.రవికుమార్ తెలిపారు. ఆయన మనుమడు దుద్దుపూడి కాశీవిశ్వనాథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. తప్పిపోయిన వ్యక్తి అనారోగ్యం, మానసిక స్థితితో బాధపడుతున్నట్లు ఆయన తెలిపారు.

అదృశ్యమైన బాలికల ఆచూకీ గుర్తింపు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం సిటీ

నగరంలో అదృశ్యమైన ముగ్గురు బాలిక ఆచూకీని పోలీసులు గుర్తించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎస్‌పి డి.నరసింహకిశోర్ ప్రత్యేక చొరవతో అతి తక్కువ సమయంలోనే రాజమహేంద్రవరం పోలీసులు ఈ కేసును చేధించారు. అదృశ్యమైనట్టు తెలియగానే గాలింపు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 24 మధ్యాహ్నం వారు ఇళ్ల నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యారు. సిసి కెమెరాలు, టెక్నికల్ ఎవిడెన్స్, సోషల్ మీడియా అకౌంట్స్ వంటి వాటిని శోధించి ముగ్గురిని గుర్తించారు. కేసు చేదించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన అధికారులు, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

కోడి పందేలు, పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి - గోపాలపురం, సామర్లకోట

మండలంలో కోడి పందేలు, పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహించారని ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. ట్రైనీ ఎస్ఐ పి.శివగణేష్, సిబ్బంది దొండపూడి గ్రామం మేదరపేటలో కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.5వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. అలాగే కొవ్వూరుపాడులో పేకాట శిబిరంపై దాడలు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.3వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సామర్లకోట వేట్లపాలెంలోని మంగాయమ్మ కాలనీలో పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేసిన ఏడుగురిని అరెస్టు చేశారు. పేకాడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సామర్లకోట సిఐ ఎ.కృష్ణభగవాన్ సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడులు చేశారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.11,350 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - రాజోలు

కడలిగమల్లపాలెం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మరణించగా, ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజోలు మండలం కడలి గ్రామానికి చెందిన ఆకుమర్తి అన్వేష్, పెద్దపూడి శ్రీను, చెన్నాడం గ్రామానికి చెందిన దొండపాటి సన్నీ కలిసి మోటర్‌సైకిల్ కడలివడ్డీవారి గ్రూపులో జరిగిన క్రిస్మస్ వేడు కలో పాల్గొన్నారు. అనంతరం వారు మోటార్‌సైకిల్‌పై కడలి సెంటర్ నుంచి ములికిపల్లి వైపు వెళుతూ గమల్లపాలెంలో ఉన్న సన్నీ ఇంటికి వెళ్లేందుకు ఎడవైపునకు తిరిగారు. ఈ సమయంలో వెనుక నుంచి మరో బైక్‌పై వస్తున్న సోడే గణేష్ (భద్రాచలం) మితిమీరిన వేగంతో రాంగ్ రూటులో వచ్చి వెనుక నుంచి వీరి మోటార్‌సైకిల్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో మోటర్‌సైకిల్ పై ఉన్న ముగ్గురు యువకులు కింద పడిపోయారు. మోటర్ సైకిల్ నడుపుతున్న శ్రీనుకు, మధ్యలో కూర్చున్న సన్నీకి తీవ్ర గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న ఆకుమర్తి అన్వేష్(20) వెనుకకు పడిపోవడంతో తలకు గాయమై అక్కడిక్కడే మరణించాడు. పెద్దపూడి శ్రీను ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నాగేశ్వరరావును అభినందిస్తున్న సభ్యులు

సగరులకు ఎంఎల్‌సి కేటాయించాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

రాష్ట్రంలోని సగర కులస్తులకు ఎంఎల్‌సి పదవి కేటాయించాలని బిసి ఐక్య సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు అన్నారు. ఉమ్మడి జిల్లాల సగర సంఘం ఉపాధ్యక్షులుగా నియమితులైన చనిబోయిన నాగేశ్వరరావును చినశంకర్లపూడిలో సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. జిల్లా ఉపాధ్యక్షునిగా ఎన్నికైన నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 1,50,000 ఓట్లు ఉన్న సగర కులస్తులకు ప్రభుత్వం కమ్యూనిటీ హాలు నిర్మించాలని, 30 అడుగుల భగీరథ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోద్రి అర్జునుడు, చనిబోయిన రాంబాబు, చనిబోయిన బుజ్జి పాల్గొన్నారు.

29న ఉపాధి భవన్‌లో జాబ్‌మేళా

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్థానిక ఉపాధి భవన్‌లో ఈ నెల 29న సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే డిడియుజికెవై ట్రైనింగ్ సెంటర్లలో వివిధ కోర్సుల కొరకు శిక్షణ తీసుకొనే అభ్యర్థులు ఎంపికకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. కాకినాడ, రాజమండ్రి, సామర్లకోట, ముమ్మిడివరం, అమలాపురం సెంటర్లలో ఉన్న రిటైల్, వెబ్‌డెవలపర్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, రోడ్ సర్వేయర్, ఎలక్ట్రికల్, ప్లంబర్, మల్టీ టెక్నీషియన్, హోమ్ వంటి కోర్సులలో 90 రోజులు శిక్షణ కల్పించి వారికి ఉపాధి అవకాశం కల్పిస్తారన్నారు. శిక్షణలో భోజన, వసతి సదుపాయం ఏర్పాటు చేశామన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక

ప్రజాశక్తి-రౌతులపూడి

విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన పదో తరగతిలో మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణతకు రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన వంద రోజుల ప్రణాళిక ఈ నెల 6 నుంచి మార్చి 15 వరకూ కొనసాగించి ఆదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో అభ్యసన పెరిగి ఆత్మస్థయిర్యం పెంపొందించేందుకు ఈ ప్రణాళిక ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 32 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 3,200 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. రానున్న పరీక్షల నేపథ్యంలో ఉపాధ్యాయులు వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ వివిధ సబ్జెక్టులకు నాలుగు విడతలుగా చదివిస్తున్నారు. చివరి విడతలో విద్యలో నిపుణులు తయారుచేసిన ప్రశ్న పత్రాలను ఆన్‌లైన్‌లో సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. అందులో వచ్చిన మార్కులు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. రెండో శనివారం ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ తరగతులు నిర్వహిస్తారు. సెలవు రోజుల్లో సైతం విద్యార్థులకు భోజన వసతి ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విద్యార్థులను లెవెల్ వన్ ఎ, బి కేటగిరీ లెవెల్ టు సి, డి క్యాటగిరీగా విభజించారు. రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకూ రెమిడియన్ బోధనతోపాటు సందేహాలను నివృత్తి చేస్తారు. లెవెల్ వన్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా లెవెల్ టూ విద్యార్థులు ఉత్తీర్ణత్త సాధించేలా తీర్చిదిద్దడంతో పాటు పరీక్షలు అంటే భయం పోగొట్టేలా శిక్షణ ఇస్తున్నారు. పదిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఈ కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ రూపొందించింది. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని పాఠశాలలను 100 రోజుల ప్రణాళిక ప్రవేశపెట్టి విద్యార్థుల సామర్థ్యం ఆధారంగా లెవెల్ వన్ లెవెల్ టూగా విభజించి వారి ప్రతిభను తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని ఎంఇఒ గాడి కొండబాబు తెలిపారు.



బోధనను పరిశీలిస్తున్న ఎంఇఒ కొండబాబు

ప్రభుత్వంలో ఆటంకం లేని అభివృద్ధి

ప్రజాశక్తి -తాళ్లరేవు

టిడిపి కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఏ ఆటంకాలూ లేకుండా సాగాలని ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. ఎంఎల్‌సిగా విజయం సాధించిన తర్వాత సందర్భంగా ఐ.పోలవరం మండలంలోని తన స్వగ్రామం నుంచి మండలంలోని కొత్తూరు మహాలక్ష్మి అమ్మ ఆలయం వరకూ ఆయన శుక్రవారం ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందన్నారు. పేద వర్గాల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు విరివిగా అమలు చేస్తున్నామని, ఎంఎల్‌సిగా తాను విజయం సాధించినప్పటి నుంచి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రతి ఏడాదీ డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించనుందని తెలిపారు. జాబ్ కేలండర్ తప్పక అమలు చేస్తుందన్నారు. ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు, టిడిపి అంబేద్కర్ కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి పాదయాత్రలో ఎంఎల్‌ఎ రాజశేఖర్‌తో కొద్దిసేపు నడిచారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ధూళిపూడి బాబీ, నడింపల్లి వినోద్, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, వాడ్రేవు వీరబాబు, భజన సత్తిబాబు, కొత్తూరు కాశీ ఈశ్వరుడు, వాసంశెట్టి శ్రీనివాస్, అత్తిలి బాబూరావు, విఆర్ఎన్‌బి. ప్రసాద్, అల్లూరి రామకృష్ణంరాజు, జక్కల ప్రసాద్ బాబు, ఉంగరాల వెంకటేశ్వరరావు, కొత్తూరు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఎంఎల్‌సి రాజశేఖరంకు స్వాగతం పలుకుతున్న నాయకులు

కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

నిత్య జీవితంలో కష్టాలు ఎదుర్కొనే పేద ప్రజలను ప్రార్థన మందిరాలు ఆదుకోవాలని శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. జి.వేమవరం పంచాయతీ మట్లపాలెం కాలనీలోని విమోచన ప్రేయర్ హౌస్‌లో కడియాల విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవితంలో ఎదురయ్యే సమస్యల నుంచి, మంచి బోధనలు ఉపశమనం కలిగిస్తాయన్నారు. కష్టానికి ఎప్పటికైనా ఫలితం ఉంటుందని తన జీవితమే ఉదాహరణ అన్నారు. గత ఐదేళ్లలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న తనను గుర్తించి రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. విజయ్ కుమార్ కుమార్తెలు బ్యూలా గ్రేస్, బిందు ప్రియ ఆధ్వర్యంలో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ప్రముఖ వ్యాపారవేత్త లంకలపల్లి శ్రీనివాస్, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు గండి అప్పారావు, జనసేన నాయకులు పుణ్యమంతుల సత్తిబాబు, నిర్వాహకులు కడియాల కాశీ రాజేశ్వరి, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న సభ్యులు

క్రిస్మస్ వేడుకల్లో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

ప్రజాశక్తి - సామర్లకోట

యేసుక్రీస్తు జననం సర్వ మానవాళికి పండుగ అని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మాధవపట్నంలో జాయ్‌ఫుల్ జర్నీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన మెగా క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు డాక్టర్ వల్లూరి నోవాహు, వల్లూరి మంజుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వమించారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రేమ, త్యాగం, సేవా భావనలే ప్రధాన ఉద్దేశంగా యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చి మానవాళి పాపాల పరిహారానికి సిలువపై బలిదానమిచ్చారని తెలిపారు. ఆయన జన్మదినాన్ని ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలూ ఆనందోత్సవాలతో జరుపుకోవడం విశేషమన్నారు. జాయ్‌ఫుల్ జర్నీ మినిస్ట్రీస్ ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలకు అవసరమైన సహకారం అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పేదలు, వద్దులకు వస్త్రాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 200 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఎంపీ ఉదయ్ శ్రీనివాసును మినిస్ట్రీస్ ప్రతినిధులు, గ్రామ నాయకులు ఘనంగా సత్కరించారు. గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, నక్కా శాంతిరాజు, డిఎ.రాజు, డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.



ఎంపీ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న చర్చి సభ్యులు

ఘనంగా సిపిఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో సిపిఎం 101వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ చెలికాని రామారావు స్మారక భవనం లో సిపిఐ పతాకాన్ని సీనియర్ నాయకులు డాక్టర్ చెలికాని స్టాలిన్ ఎగురవేశారు. ఈ సందర్భంగా స్టాలిన్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వి.గోపాలరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. రాము మాట్లాడుతూ భారతదేశంలో డిసెంబర్ 26, 1925న ఉత్తరప్రదేశ్ లో కాన్పూర్ నగరంలో ఎస్‌కె. ఘూటే అధ్యక్షతన సిపిఐ ఆవిర్భవించిందన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం అనేక కుట్ర కేసులతో నిర్బంధాన్ని ఎదుర్కొంటూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని డిమాండ్ చేసిందన్నారు. సమాజంలోని పేదరికం, లింగ, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిందన్నారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షంగా ఉంటూ కార్మికుల హక్కుల కోసం అనేక చట్టాలు, వ్యవసాయ కార్మికుల కోసం భూసంస్కరణ చట్టం, బ్యాంకులు జాతీయకరణ, రాజాభరణాల రద్దు, ప్రజలందరికీ విద్యుత్తు, పేదలకు ఇల్లు, నిరుద్యోగం సమస్యలు పరిష్కారానికి కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో ఎం. ప్రేమనందం, ఎస్.శారదాదేవి, బిసి సంఘాల నాయకులు బి.రామకష్ణ, యు.రాంబాబు, పార్టీ కార్యకర్తలు వి.కృష్ణమూర్తి, కృష్ణ, జి.రాజు, ఎ.మాచరావు, ఎం.గోపి, బి.సత్యానారాయణ, నాగమణి, సరోజ, సుధా, సభ్యులు పాల్గొన్నారు.



ఎర్రజెండా ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు స్టాలిన్ తదితరులు

డెంగీ నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - కొత్తపేట

ప్రస్తుత వాతావరణంలో డెంగీ విజృంభించే లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచి వ్యాధి బారిన పడకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. వానపల్లి పిహెచ్‌సి బిళ్ళకుర్రు ఉపకేంద్ర పరిధిలో వాకాడవారిపాలెం నందు అనుమానిత డెంగీ కేసు నమోదైంది. ఆ ప్రాంతంలో ఆయనతో పాటు కొత్తపేట మలేరియా సబ్ యూనిట్ అధికారి యస్.రాజబాబు శుక్రవారం పర్యటించారు. ఆ ఏరియాలో ఫ్రైడేడ్రైడే కార్యక్రమ నిర్వహణ, ఇంటింటా సందర్శనల ద్వారా దోమల లార్వా గుర్తింపు, ఎబెట్, ఇండోర్ స్ప్రేయింగ్ చేయాలన్నారు. ఈ విషయంలో పంచాయతీ సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు ఇళ్ళ శ్రీను, ఆశా డి.మంగాదేవి పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ పంతం నానాజీ

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి -కరప

కరప మండలంలో పెనుగుదురులో గురువారం ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పథకాన్ని రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ ప్రారంభించారు. జల జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.76 లక్షలతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రజా దర్బారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల రామచంద్ర రావు, కడలి ఈశ్వరి, పెంకె శ్రీనివాస్ బాబా, కటకం శెట్టి బాబీ, నులుకుర్తి వెంకటేశ్వరరావు, బండారు మురళి, భోగిరెడ్డి కొండబాబు, ముద్రగడ రమేష్, గొల్లపల్లి చంద్రశేఖర్, రెడ్డిపల్లి నారాయణరావు, మాచరరావు, తుమ్మల పల్లి గోవింద్, వెలుగుబంట్ల సూరిబాబు, సైనవరపు భవానీ శంకర్, భోగిరెడ్డి గంగాధర్, గంట నానీబాబు, హరనాథ్, మారెళ్ల శివ, అనుకూల రాంబాబు, కోటగిరి మహేంద్రబాబు, భవాని, రమ్య, జోకా తాతాజీ, ప్రకాష్ గౌడ్ అధికారులు జె.శ్రీనివాస్, వర్ధన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభను కలిసిన రంగనాగ్

రంగనాగ్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి-సామర్లకోట

టిడిపి జిల్లా ఉపాధ్యక్షునిగా ఎన్నికైన పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ శుక్రవారం జిల్లాలో పలువురు ఎంఎల్‌లను కలిశారు. తొలుత జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, సీనియర్ నాయకులు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రత్తిపాడు ఎంఎల్ఎ వరపుల సత్యప్రభను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. రంగనాగ్ వెంట బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, పాలకుర్తి శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు



అర్జీలు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ

సమస్యలను తక్షణం పరిష్కరించాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. పెదశంకర్లపూడిలోని టిడిని కార్యాలయంలో ఎంఎల్ఎ శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ ఇబ్బందులను ఎంఎల్ఎకు వివరించారు. ఎంఎల్ఎ సత్యప్రభ మాట్లాడుతూ ప్రజలు పడుతున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



పురస్కారం అందుకుంటున్న సూర్యనారాయణమూర్తి

భళ్లమూడికి ఉత్తమ సేవా పురస్కారం

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ భళ్లమూడి సూర్యనారాయణమూర్తికి రాష్ట్రస్థాయి వినియోగదారుల సేవా పురస్కారం లభించింది. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సెమినార్లో సివిల్ సప్లైస్ రాష్ట్ర కమిషనర్ సౌరజ్ గౌర్ ద్వారా ఆయన ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు శీతాకాలం నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ విఎస్ఎస్ఎం.మూర్తి, డాక్టర్ వి.శారద సూచించారు. పాశర్లపూడి పంచాయతీ కార్యాలయం లో సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి ఆధ్వర్యంలో అమలాపురం రోహిణి తల్లి పిల్లల ఆస్పత్రి వారు శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరం లో 72 మంది చిన్నపిల్లలకు, 19 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన రూ.20 వేల విలువైన మందులు ఉచితంగా అందజేశారు. చలిగాలులు ఎక్కువగా ఉండటం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, పంచాయతీ కార్యదర్శి జి.వాసు పాల్గొన్నారు.

యానాం వార్తలు



నివాళులర్పిస్తున్న పరిపాలనాధికారి అంకిత్ కుమార్, ఇతర అధికారులు

ఘనంగా యర్రా జగన్నాథరావు జయంతి

ప్రజాశక్తి - యానాం

ఫ్రెంచ్ కాలంలో మేయర్‌గా పని చేసిన యర్రా జగన్నాథరావుకు యానాంలో అధికారులు నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్థానిక ఫెర్రీ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ప్రాంతీయ పరిపాలనాధికారి అంకిత్ కుమార్, సిఐ సుందరం, ఎస్ఐలు పునీత్‌రాజ్, శేరు నూకరాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, ముత్యాల బోస్, జయ, సీతారామరాజు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జైలే

ప్రజాశక్తి - యానాం

న్యూ ఇయర్ వేడుకలు పురస్కరించుకుని మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని యానాం ఎస్‌పి వరదరాజన్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే ఆరు నెలలు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. డిసెంబర్ 31న రాత్రి యానాం, పరిసర గ్రామాల్లో పోలీస్ బలగాలతో సుమారు 50 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. రోడ్లపై రేసింగ్‌లు, ర్యాష్ డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. పోలీసులకు సహకరించాలని కోరారు.

తుపాను నష్ట పరిహారం జమ

ప్రజాశక్తి - యానాం

మొంథా తుపాను కారణంగా నష్టపోయిన యానాం ప్రజలకు పుదుచ్చేరి ప్రభుత్వం ప్రతి రేషన్ కార్డుకు రూ.3 వేలు మంజూరు చేసింది. శుక్రవారం నుండి మొత్తం 15,483 రేషన్ కార్డుదారులకు దసలవారీగా రూ.3 వేల చొప్పున బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారు. ఈ సందర్భంగా సిఎం రంగసామి, గవర్నర్ కైలాషనాథన్, సంబంధిత అధికారులకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రయాణికులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

బైకులపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రమైన జగ్గంపేట నుంచి కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్ ప్లాజా వరకు ప్రజలకు అవగాహన కలిగించేందుకు శుక్రవారం బైకులపై హెల్మెట్‌లు ధరించి పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గతంలో కంటే ప్రమాదాలు తగ్గాయని, మరింత తగ్గించుకునేందుకు హెల్మెట్లు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి, ఎస్ఐలు టి.రఘునాథరావు, జి.సతీష్, వై.శివనాగబాబు పాల్గొన్నారు.

పెట్రోల్ కల్తీపై వాహనదారుల ఆందోళన

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావులపల్లి పెట్రోల్ బంక్ వద్ద ద్విచక్ర వాహనదారులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కాట్రావులపల్లి శివారు భారత్ పెట్రోల్ బంకులో ఆయిల్ కొట్టించుకున్న వారి అనేకమంది ద్విచక్ర వాహనాలు రిపేర్లకు గురయ్యాయి. పెట్రోల్ కల్తీ అవడంతో బైకులు రిపేర్లకు వస్తున్నాయని వాహనదారులు బంక్ వద్ద ఆందోళన చేపట్టి బంక్ యాజమాన్యంపై ఆగ్రహించారు. తమకు న్యాయం చేసి, బంక్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

యూరియా అధిక ధరలపై చర్యలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలో రైతులకు యూరియాను ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు చేపడతామని మండల వ్యవసాయ శాఖ అధికారి కెవివి.సత్యనారాయణ తెలిపారు శుక్రవారం పట్టణంలో మండలంలోని ఫెర్టిలైజర్స్ డీలర్లకు ఎఒ సత్యనారాయణ సమావేశం నిర్వహించారు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా ప్రతి ఒక్కరూ కార్డులపై సరఫరా చేయాలని, రైతు సేవా కేంద్రం నుంచి కార్డులు తీసుకోవాలని, యూరియా అధిక ధరలకు అమ్మినట్లయితే చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఫెర్టిలైజర్స్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, నానాజీ, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ఐ.పోలవరం

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉభయగోదావరి పట్టభద్రుల ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. జి.వేమవరంలో ఉన్న ఆయన నివాసం నుంచి శుక్రవారం తాళ్లరేవు మండలం మట్లపాలెం మహాలక్ష్మి ఆలయం వరకు 26 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. ఉదయం 5.30 గంటలకు ఆయన పాదయాత్రను ప్రారంభిం చారు. దారిపొడుగునా అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు,స్నేహితులు ఆయన కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు మంచి జరగాలని, కూటమి ప్రభుత్వ పరి పాలన సక్రమంగా జరగాలని ఈ పాదయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఆయన వెంట పెంటా రవివరప్రసాద్, చోడిశెట్టి బ్రహ్మానందం, మునిరాజు ఉన్నారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం.138/2025

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ప్రక్కిలంక బ్రాంచ్, రిప్రెజెంటెడ్ బై బ్రాంచ్ మేనేజర్ ...వాది

మరియు

1.పవన్ ఏజెన్సీస్, ప్రొ.రాగు పవన్‌కుమార్,
2.రాగు పవన్‌కుమార్ ...ప్రతివాదులు

దావానోటీసు

1,2 ప్రతివాదులు అడ్రెస్.
1. పవన్ ఏజెన్సీస్, ప్రొ.రాగు పవన్‌కుమార్ D.No.3-92/1, రావిచెట్టువీధి, పెద్దేవం, తాళ్లపూడి మండలం.
2. రాగు పవన్‌కుమార్, తండ్రి ఉమా మహేశ్వరరావు, వయస్సు31, పురుషుడు, D.No.3-92/1, రావిచెట్టువీధి, పెద్దేవం, తాళ్లపూడి మండలం.

పై దావా పరిహార నిమిత్తం వాది మీపై దావాను దాఖలు చేసి వున్నారు. సదరు దావాలో మీరు ప్రతివాదులు అయివున్నారు. కావున మీరు స్వయంగా కాని ప్లీడరు గారి ద్వారా కానీ ది.09-01-2026 తేదిన ఉదయం 10.30 కు పై కోర్టు లో హాజరై ఆక్షేపణలు తెలుపుకోగలరు లేని ఎడల సదరు దావాను మీ పరోక్షమందు తీర్మానించెదరు.

వాయిదా తేది.09-01-2026

పి.ఉదయ భానుజీ
వాది తరపు అడ్వకేట్,కొవ్వూరు
సెల్.9440536819

మహారాజశ్రీ రామచంద్రపురం 13వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జివారి కోర్టులో

C.M.A.1/2025

Between:-
మెర్ల సత్యన్నారాయణ మూర్తి ...పిటిషనర్/అప్పిలెంట్
And
వేగుళ్ళ అజయ్ కుమార్ వగైరా ...ప్రతివాదులు
To.
R1. వేగుళ్ళ అజయ్ కుమార్ S/o. (లేటు) రాంబాబు, వయస్సు 43సం॥లు, D.No.10-3-6/3, మండపేట, మండపేట మండలం, కోనసీమజిల్లా.

పబ్లిక్ నోటీసు

పై నెంబర్ దావాలో పిటిషనర్/అప్పిలెంట్ దావా పరిహారం నిమిత్తం మీపై పిటిషనర్/ అప్పిలెంట్ అప్పీలు దాఖలు చేసియున్నారు. సదరు అప్పీలు మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు సమన్లు జారీచేసినను తప్పించుకుని తిరుగుచుండుటచేత శ్రీ కోర్టువారు పై నెంబర్ దావాలో మీ యొక్క హాజరు నిమిత్తమై **ది.29-1-2026వ** తేదిన వాయిదా వేసియున్నారు. కావున సదరు దావాలో మీకు ఏమైన వాదనలు కాని, ఆక్షేపణలు కాని ఉన్న యెడల వాయిదా రోజు ఉదయం**10.30**గంటలకు పై కోర్టు నందు మీరు స్వయంగా కాని, ప్లీడర్‌తో గాని హాజరు అయ్యి మీ వాదనలు, ఆక్షేపణలు తెలియ పరచవలెను. లేనిచో మీ పరోక్షము తీర్మానించడం జరుగునని ఇందుమూలంగా తెలియజేయడం అయినది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

B.H. పద్మనాభరాజు
S.గంగాధరం
అడ్వకేట్స్
రామచంద్రపురం

రామచంద్రపురం
26-12-2025